సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



కోటి రూపాయలు కాజేశారు

సబ్ పోస్టాఫీస్‌లో ఖాతాదారుల నగదును సబ్ పోస్ట్‌మాస్టర్ తన ఖాతాల్లోకి మళ్లించి విత్‌డ్రా చేసుకున్నట్లు ఆరోపిస్తున్నారు. - 8లో



ఆకట్టుకున్న సృజన టెక్ ఫెస్ట్

నల్లగొండలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన సృజన టెక్ ఫెస్ట్ ఆకట్టుకుంది. - 8లో



ఆదాయం రూ.27.72 లక్షలు

చెర్వుగట్టు ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. 28 రోజులకు రూ.27.72 లక్షల ఆదాయం సమకూరింది. -8లో

న్యూస్‌రీల్

రేపు లోక్ అదాలత్

రామగిరి(నల్లగొండ): జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఈనెల 23న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పర్యవేక్షణలో ప్రీ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి బి.దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, యాక్సిడెంట్, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్, భూ వివాదాలు, వినియోగదారులకు సంబంధించినవి, సివిల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్తీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

నార్కట్‌పల్లి: రైతులకు కల్తీ ఎరువులు విక్రయించే డీలర్లపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ఎరువుల దుకాణాల డీలర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు విత్తనాలు, ఎరువుల విక్రయాల విషయంలో నిబంధనలు విధిగా పాటించాలన్నారు. విత్తనాలు, ఎరువులు నాణ్యతలో లోపాలు ఉండొద్దన్నారు. రైతులకు అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి గిరిప్రసాద్, ఏఈఓలు లియాఖత్‌అలీ, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా కొత్తగా కొలువుదీరిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించేలా ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సాగర్ ఆయకట్టు కింద యాసంగి పంటకు ఆరుతడి నీళ్లు విడుదల చేయాలన్నారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఆ రాష్ట్రంలోని ప్రాజెక్టుల ద్వారా దిగువకు నీటిని విడుదల చేసేలా ప్రయత్నాలు చేయాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీల సభ్యులను సస్పెండ్ చేయడం పట్ల ఇండియా కూటమి పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లాలోని అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, నాయకులు రవినాయక్, వినోద్‌నాయక్, సైదులు, పాపానాయక్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, ఖాజా, దయానంద్, సుభాని, కరీమున్నీసా పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

భానుపురి (సూర్యాపేట): జిల్లా కేంద్రంలోని భగవద్గీత మందిరంలో గురువారం దేవాలయాలు, ధార్మిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. పట్టణంతోపాటు జిల్లాలోని 30 పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. భగవద్గీతలోని 20 ముఖ్యమైన శ్లోకాలను చదివి వినిపించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్ నాగవెల్లి ప్రభాకర్, కోకన్వీనర్ పర్వతం శ్రీధర్ కుమార్, మహేశ్వరం రవిచంద్ర, మొరిశెట్టి రామ్మూర్తి, గట్ల సోమయ్య, నాగవెల్లి దశరథ, మిర్యాల అరుణ భారతి, సత్తిరెడ్డి, గుండా రమేష్, విజయకృష్ణ, దేవులపల్లి ప్రశాంతి, చకిలం కవిత, అన్నపూర్ణ నీరజ, దేవిక, శ్రీలత పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

'డబుల్'పై సందిగ్ధం

- నీలగిరిలో లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయించని డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- రెండంతస్తుల భవనాలున్న వారికీ డ్రాలో దక్కిన గృహాలు
- అనర్హులను ఎంపిక చేశారని ఫిర్యాదులు
- విచారణకు ఆదేశించిన యంత్రాంగం
- ఐదు నెలలవుతున్నా బయటికి రాని నివేదిక



నీలగిరి మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం

మొత్తం వార్డుల సంఖ్య	48
నిర్మించిన ఇళ్లు	560
వచ్చిన అర్జీలు	19,950
అర్హత పొందినవి	15,170
తిరస్కరించినవి	4,780
ఎంపికైన లబ్ధిదారులు	560

నల్లగొండ టూటౌన్: గత ప్రభుత్వం హయాంలో నీలగిరి మున్సిపల్ పరిధిలోని ప్రజలకు కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఎంపిక లోప భూయిష్టంగా చేశారని అప్పట్లో బహిరంగంగానే విమర్శలు వినిపించాయి. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తడంతో జిల్లా యంత్రాంగం విచారణకు ఆదేశించింది. ఐదారు నెలలైనా విచారణ నివేదిక బయటికి రాకపోవడం, లబ్ధిదారులకు నేటికీ ఇళ్లను అప్పగించకపోవడం, ఇంతలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో డబుల్ ఇళ్ల కేటాయింపుపై సందిగ్ధత నెలకొంది.

అనర్హులకు దక్కిన ఇళ్లు

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకునేందుకు నీలగిరి మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్న ఆధార్ కార్డు, రేషన్ కార్డును గతంలో అధికారులు తప్పనిసరి చేశారు. కానీ కొందరు రెండు, మూడు అంతస్తుల భవనాలు ఉన్నవారు సైతం దరఖాస్తు చేసుకున్నారు. పట్టణంలో భారీ భవంతులు ఉన్న వారికి కూడా తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. దాంతో శివాజీనగర్ ప్రాంతంలో ఓ వృద్ధురాలికి వాణిజ్య దుకాణాలు ఉన్నా డబుల్ బెడ్‌రూం ఇల్లు వచ్చింది. అదే విధంగా ఇందిరమ్మ కాలనీలో సొంతిల్లు ఉన్న ఓ మహిళకు కూడా డబుల్ బెడ్‌రూం ఇల్లు తగిలింది. బీటీఎస్ ప్రాంతంలో కూడా రెండంతస్తుల భవనం ఉన్న వ్యక్తికి డబుల్ బెడ్‌రూం ఇల్లు డ్రాలో వచ్చింది. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఇరవై మందికిపైగా అనర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు దక్కాయి. అర్హులకు ఇళ్లు రాకపోవడంతో లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా చేపట్టలేదని కౌన్సిలర్లు సైతం అభ్యంతరం తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చేసిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను రద్దు చేస్తుందనే చర్చ సాగుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అర్హులైన పేదలకు మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించే ఆలోచనలో కొత్త ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

మిగిలిన పనులు పూర్తయ్యేదెప్పుడో?

ఏడెనిమిదేళ్లుగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు కొనసాగినా నిధుల లేమితో నేటికీ పూర్తి కాలేదు. అంతర్గత పనులు పూర్తి కాకముందే అప్పటి ప్రభుత్వం హడావుడిగా లబ్ధిదారుల ఎంపిక చేసింది. ఇంకా కరెంట్, తాగు నీటి సౌకర్యం, నీటిసంపు, సెప్టిక్ ట్యాంకు వంటి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. కానీ నిధులు ఎప్పటికి వస్తాయో అర్థం కాని పరిస్థితి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం నిధులు కేటాయిస్తేనే ఈ పనులన్నీ పూర్తి కానున్నాయి.

బయటపెట్టని విచారణ నివేదిక

నీలగిరి పట్టణంలో పేదల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతేడాది కలెక్టరేట్ వెనుకభాగంలో, ఎఫ్‌సీఐ గోదాం సమీపంలో 560 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. అయితే లబ్ధిదారుల ఎంపిక సమయంలోనే అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తడంతోపాటు ఆందోళనలు చేశారు. దీనికితోడు వార్డు సభలు పెట్టి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించినా ఎంపికలో అక్రమాలు చోటుచేసుకోవడం గమనార్హం. అసలైన లబ్ధిదారులకు ఇళ్లు రాకపోవడం, రెండంతస్తుల భవనాలు ఉన్న వారికి, వాణిజ్య దుకాణాల యజమానులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు దక్కినట్లు కొందరు ఆధారాలతో సహ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు విచారణ జరిపించారు. నెలలు గడుస్తున్నా నేటికి విచారణ నివేదిక మున్సిపల్ కార్యాలయానికి చేర కపోవడం వెనుక ఆంతర్యమేమిటన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. చేసిన తప్పులను సరిదిద్దుకోలేక సంబంధిత అధికారులు కూడా సతమతవుతున్నట్లు తెలిసింది.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించండి

- ఎస్పీ అపూర్వరావు



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండక్రైం: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెల వారీ నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్ కేసులను ఛేదించేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించి తగిన ఆధారాలు సేకరించి నేరస్తులకు శిక్ష పడేలా చేయాలన్నారు. దొంగతనాలు, పోక్సో కేసుల్లో మరింత పురోగతి సాధించాలన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేందుకు అంకితభావంతో పని చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా బాధితులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ శాఖ అమలు చేస్తున్న 16 ఫంక్షనల్ వర్టికల్స్‌ను పక్కా ముందుకు తీసుకెళ్లాన్నారు. పోలీసులు సమర్థవంతమైన సేవలు అందించినప్పుడే ప్రజల నుంచి మన్ననలు పొందుతారన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. నేర సంఘటనలు జరుగకుండా పక్కాగా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు అండగా ఉండాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, పేకాట, రేషన్ బియ్యం అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పదే పదే నేరాలకు పాల్పడితే పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

కదులుతున్న అక్రమాల డొంక

- మిర్యాలగూడలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై మొదలైన విచారణ
- ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్న జిల్లా యంత్రాంగం
- ఇప్పటికే ప్రాథమిక వివరాల సేకరణ
- త్వరలోనే రెవెన్యూ శాఖకు నివేదిక

మిర్యాలగూడ: ప్రభుత్వ భూముల ఆక్రమణలపై జిల్లా రెవెన్యూ అధికారులు స్పందించారు. మిర్యాలగూడలో భూ మాయ! శీర్షికన ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతో జిల్లా అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో విచారణ ప్రారంభించారు. ప్రభుత్వ భూముల కబ్జాపై రికార్డులను పరిశీలించి అక్రమణలను గుర్తిస్తున్నారు. అధికారులు దర్యాప్తు వేగవంతం చేయడంతో ఎట్టకేలకు ప్రభుత్వ భూముల ఆక్రమణల డొంక కదులుతోంది.



ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనం

వివరాలు సేకరిస్తున్న అధికారులు

మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ శివారులో సర్వే నంబర్ 5లో 10.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా కొందరు దాన్ని 14.40 ఎకరాలుగా పెంచారు. ఏకంగా భూమి విస్తీర్ణం పెంచి రికార్డులు నమోదు చేయించుకొని ఇప్పుడు తమకు సదరు సర్వే నంబర్‌లో ఎక్కువ భూమి ఉందంటూ మరికొంత కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో సమగ్రంగా వార్తా కథనం రావడంతో దాని ఆధారంగా అధికారులు పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. సర్వే నంబర్ 5లో ఎవరెవరి పేరు మీద రికార్డులు ఉన్నాయి, వారికి ఎప్పుడు కేటాయించారు, దానికి సంబంధించిన అసైన్‌మెంట్, అమెండ్‌మెంట్ ఏమైనా ఉన్నాయా, పట్టా సర్టిఫికెట్లు ఏమైనా జారీ చేశారా, చేస్తే ఏ కోణంలో చేశారు అనే విషయాలను అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. ఎవరెవరు ఏ సంవత్సరంలో రికార్డులో ఎక్కారు దాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటికే స్పెషల్ బ్రాంచ్, విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రాథమిక వివరాలు, ఆధారాలు సేకరించి ఉన్నతాధికారులకు సమర్పించారు. అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా ప్రభుత్వ భూముల కబ్జాపై సమగ్రంగా విచారణ జరిపి త్వరలోనే రెవెన్యూ ఉన్నతాధికారులకు నివేదికను అందించేందుకు మిర్యాలగూడ రెవెన్యూ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కబ్జాకు గురైన భూముల నుంచి అక్రమార్కులను ఖాళీ చేయించి ప్రభుత్వ భూమిని తమ ఆధీనంలోకి తీసుకోవాలని.. దానికి అనుగుణంగా చర్యలు చేపట్టేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు.

రైతుబంధు సమితులు రద్దు

- 144 రైతు వేదికల నిర్వహణ ప్రశ్నార్థకం
- ఒక్కో వేదికకు రూ.22 లక్షలు వెచ్చించి నిర్మాణం
- రైతులకు సలహాలు, సూచనలు అందనట్లేనా..!



త్రిపురారంలోని రైతు వేదిక

నల్లగొండ అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు సమితులను రద్దు చేసింది. దీంతో ఆయా స్థాయిల్లో ఉన్న అధ్యక్షులతో పాటు సభ్యులు కూడా పదవులు కోల్పోయారు. ఫలితంగా వ్యవసాయ క్లస్టర్లలో ఉన్న రైతు వేదికల నిర్వహణ పశ్నార్థకంగా మారింది. వ్యవసాయ సీజన్ ప్రారంభ సమయంలో రైతులు సలహాలు, సూచనలు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. రైతుబంధు సమితులను రద్దు చేసిన నేపథ్యంలో రైతు వేదికలను రైతుల అవసరాల కోసం వినియోగిస్తారా..? లేక వాటిలో ఇతర ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహిస్తారా..? అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

రూ.22 లక్షలతో రైతు వేదిక నిర్మాణం

రైతులకు పంటల సాగులో ఆధునిక పద్ధతులు, మార్కెటింగ్ సీజన్‌లో అవసరమైన సలహాలు, సూచనలపై సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించడమే లక్ష్యంగా గత ప్రభుత్వ రైతు వేదికలు నిర్మించింది. ఒక్కో రైతు వేదికకు రూ.22 లక్షలు వెచ్చించి జిల్లాలో 144 వేదికలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో రైతులను చైతన్య పరచడానికి గ్రామ పంచాయతీకి ఒక రైతుబంధు సమితి ఏర్పాటుతో పాటు మండల, జిల్లా స్థాయిల్లో రైతుబంధు సమితులను ఏర్పాటు చేసింది. ఆ సమితిలకు ఒక అధ్యక్షుడితో పాటు సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ కమిటీలన్నీ రద్దయ్యాయి.

రైతు వేదికల నిర్వహణ భారంగా..

గత ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణ బాధ్యతలను వ్యవసాయ విస్తరణ అధికారులకు (ఏఈఓ) అప్పగించింది. దాని నిర్వహణ కోసం ప్రతి నెల రూ.9 వేల చొప్పున ఇవ్వడానికి అంగీకరించింది. ఆ డబ్బు నుంచి కరెంట్ బిల్లులు, స్వీపర్ తదితర అవసరాల కోసం వినియోగించాలని సూచించింది. 30 నెలల క్రితం రైతు వేదికలను వ్యవసాయ విస్తరణాధికారులకు అప్పగించిన గత ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు కేవలం 5 నెలల నిర్వహణ ఖర్చులను మాత్రమే ఏఈఓలకు విడుదల చేసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో, వేదికల నిర్వహణ బాధ్యత ఏఈఓల నుంచి తప్పిస్తుందా.. లేదా.. అనే ప్రశ్న తలెత్తుతోంది. తమకు రావల్సిన 25 నెలల నిర్వహణ ఖర్చులు నూతన ప్రభుత్వం విడుదల చేస్తుందా లేదా అనే ఆందోళనలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు. మొత్తం మీద రైతు వేదికల నిర్వహణ ఏఈఓలకు కత్తి మీద సాములా మారింది.

ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేస్తాం



"రైతుబంధు సమితులు రద్దయ్యాయి. వాటి స్థానంలో ప్రభుత్వం నూతనంగా ఏమైనా విధి విధానాలు, మార్గదర్శకాలను తీసుకొస్తే అమలు చేస్తాం. రైతు వేదికల నిర్వహణకు నిధులు రాలేదు. నూతన ప్రభుత్వం విడుదల చేస్తే క్లస్టర్ల వారీగా ఆయా ఏఈఓలకు అందజేస్తాం.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

- హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ: జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సర్వసభ్య సమావేశం జరుగనుంది. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జరిగే ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించే అవకాశం ఉండనుందని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఎఫ్‌సీఐ డీఎంగా సుశీల్‌కుమార్‌సింగ్



నల్లగొండ: జిల్లా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) నల్లగొండ డివిజనల్ మేనేజర్‌గా సుశీల్‌కుమార్‌సింగ్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వరుణ్‌కుమార్ సూద్ గుజరాత్ రాష్ట్రానికి బదిలీ కాగా ఈయన స్థానంలో ఒడిశాలోని కటక్ జిల్లాలో డీఎంగా పనిచేస్తున్న సుశీల్‌కుమార్‌సింగ్‌ను నల్లగొండ డీఎంగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఏజీఎంగా పనిచేస్తున్న సతీష్ చంద్రన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సుశీల్‌కుమార్ సింగ్ నల్లగొండలో ఈ నెలాఖరులోగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. బదిలీ అయిన వరుణ్‌కుమార్ సూద్ 2022 ఏప్రిల్ నుంచి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు.

యాదాద్రిలో నిత్యపూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు.

లింగ వివక్షను రూపుమాపాలి



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సఖి కేంద్రం నిర్వాహకులు

కనగల్: సమాజం కొనసాగుతున్న లింగ వివక్షను రూపు మాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ రూన్సీరాణి కోరారు. గురువారం కనగల్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, లింగ వివక్ష, టోల్‌ఫ్రీ నంబర్లపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోషకాహారంపై సఖి కేంద్రం నిర్వాహకులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంజుల, శ్రీలత, రూన్సీ, సునీత, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, శ్రీదేవి, రేణుక, సామ్రాజ్యం పాల్గొన్నారు.

మున్సిపాలిటీపై బకాయిల బండ

- రూ.20 కోట్ల వరకు బకాయిలు ఉన్న నీలగిరి మున్సిపాలిటీ
- చెల్లింపులపై అధికారుల మల్లగుల్లాలు
- ప్రభుత్వం ఆదుకోకపోతే నిర్వహణ మరింత జఠిలం



నల్లగొండ టూటౌన్: కాంట్రాక్టర్లు చేసిన పనులకు సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడం, మున్సిపాలిటీ బిల్లులను చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడంతో నీలగిరి మున్సిపాలిటీలో రూ.కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. డీజిల్, పార్కుల బిల్లులు, వీధి దీపాల బిల్లులు, ఈఈఎస్ఎల్ సంస్థకు తదితర చెల్లింపులు దాదాపు రూ.20 కోట్ల మేర ఉన్నాయి. ఇన్ని కోట్లు చెల్లించే అవకాశాలు లేకపోవడంతో మున్సిపల్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇవ్వాల్సిన బిల్లులను క్రమపద్ధతి ప్రకారం చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ నిర్వహణలో గతంలో అధికారంలో ఉన్న కీలక నాయకులు జోక్యం చేసుకోవడం, మున్సిపాలిటీకి సంబంధం లేని వాటికి సైతం మున్సిపాలిటీ నిధులు ఖర్చు చేయడం లాంటి వాటితో ప్రస్తుతం నిధుల లేమి సమస్య ఎదుర్కొంటుంది. పలువురు కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన వివిధ బిల్లులకు సంబంధించి మున్సిపల్ అకౌంటెంట్ వద్ద రూ.5.76 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేసిన ఈఈఎస్ఎల్ సంస్థకు రూ.7 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. వీటితో పాటు వాహనాల డీజిల్ బిల్లులు రూ.40 లక్షలు, పార్కులకు సంబంధించి రూ.4కోట్లు, మరికొన్నింటికి సంబంధించి రూ.నాలుగైదు కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇలా మొత్తం మున్సిపాలిటీ కాంట్రాక్టర్లకు, ఇతర బిల్లులు చెల్లించాల్సినవి రూ.20 కోట్లకు పైగానే ఉన్నట్లు పాలకవర్గ సభ్యులు పేర్కొంటున్నారు.

భారంగా మారిన నిర్వహణ

గత బకాయిలు, కరెంట్ బిల్లులు చెల్లించడం, మున్సిపాలిటీ నిర్వహణ ప్రస్తుత మున్సిపల్ కమిషనర్‌కు కత్తిమీద సాముగా మారిందనే చెప్పాలి. మున్సిపాలిటీ నిర్వహణ సాఫీగా జరగాలంటే ప్రతి నెలా దాదాపు రూ.2 కోట్లు అవసరముంటుంది. మున్సిపాలిటీ పంప్‌హౌజ్, వీధి దీపాల కరెంట్ బిల్లుల చెల్లింపు, వాహనాల డీజిల్, చివరి శ్రేణి ఉద్యోగుల జీతాలు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు తదితర ఇతర ఖర్చులు మొత్తం సరాసరిగా రూ.2కోట్ల వరకు అవుతుంది. వీటన్నింటిని ఆస్తి పన్ను, నల్లా బిల్లులు, ఇతర తదితర ఆదాయ వనరుల ద్వారానే చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుత లెక్కల ప్రకారం ఆస్తి పన్ను వసూళ్లు, నల్లా బిల్లుల డబ్బులు కూడా కరెంట్ బిల్లులు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సరిపోయే పరిస్థితి లేదు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోతే నిర్వహణ మరింత జఠిలంగా మారే అవకాశం ఉంది. చివరి శ్రేణి ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చే అవకాశం ఉన్నట్లు పాలకవర్గ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


వెంకటేశ్ (ఫైల్)

చింతపల్లి: హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడు ఎక్స్ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కుర్మేడు గ్రామానికి చెందిన పాలగోని వెంకటేశ్(58) కుర్మేడు ఎక్స్‌రోడ్డు వద్ద హమాలీ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం పని ముగించుకొని రోడ్డు దాటుతుండగా మల్లేపల్లి వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం అదే బొలేరో వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

లారీలో చెలరేగిన మంటలు


మంటల్లో దగ్ధమవుతున్న లారీ

భువనగిరి క్రైం: హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీలో మంటలు చెలరేగి క్యాబిన్ దగ్ధమైంది. ఈ ఘటన భువనగిరి బైపాస్ రోడ్డులోని జాతీయ రహదారిపై గురువారం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. బ్రిక్స్ లోడ్‌తో వరంగల్‌కి వెళ్తున్న లారీ ఇంజన్ నుంచి అకస్మాత్తుగా మంటలు రావడంతో రావడంతో డ్రైవర్ నరేష్ భువనగిరి బైపాస్ రోడ్డులోని అయ్యప్ప గుడి ఎదురుగా లారీని నిలిపివేశాడు. వెంటనే లారీ నుంచి దిగిపోయి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు లారీ మొత్తం వ్యాపించకుండా ఆర్పివేశారు. కానీ అప్పటికే లారీ క్యాబిన్ మొత్తం మంటల్లో పూర్తిగా దగ్ధమైంది.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మర్రిగూడ: మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామ పంచాయతీలో గురువారం తాటిచెట్టు ఎక్కుతుండగా పైనుంచి పడి గీత కార్మికుడు గాయపడ్డాడు. వివరాలు.. వట్టిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన గీత కార్మికుడు కొంపెల్లి రాములు గురువారం గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడ్డాడు. దీంతో అతడి ఎడమచేయి విరగడంతో పాటు కాలుకు గాయమైంది. కుటుంబ సభ్యులు అతడిని మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

క్రైస్తవుల ఆధ్యాత్మిక కేంద్రంగా శుభవార్త చర్చి

- క్రిస్మస్ వేడుకలకు సుందరంగా ముస్తాబు

మఠంపల్లి: మఠంపల్లిలోని శుభవార్త చర్చి క్రైస్తవులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. 110 సంవత్సరాల క్రితం నిర్మించబడిన ఈ క్రిస్మస్ వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. చర్చి ప్రాంగణంలో ప్రపంచ శాంతిని కోరే ఆరోగ్యమాత (మేరీమాత) విగ్రహం కొలనులో భక్తులకు దర్శనమిస్తుంది. ఈ చర్చి స్థానిక క్రైస్తవుల సహకారంతో 1908 నుంచి 1915 మధ్య కాలంలో మొదటి రెవరెండ్ ఫాదర్ ఫాస్కులీచే ప్రారంభించబడింది. కొన్నేళ్ల క్రితం ఈ చర్చి శిథిలావస్థకు చేరడంతో స్థానిక క్రైస్తవ పెద్దలు 1984లో సుమారు రూ.50లక్షలతో 100 అడుగుల ఎత్తుగల రెండు గోపురాలతో అద్భుతంగా నిర్మించారు. ఈ చర్చిని స్థానికులు శుభవార్త దేవాలయంగా పిలుచుకుంటారు. అంతేగాక మొదటి ఫాదర్ ఫాస్కులీ అనాథలు, వృద్ధులకు ఆశ్రయమిచ్చేందుకు గాను స్థానికంగా అన్నమ్మ(మేరీమాత) పేరుతో మఠంను స్థాపించడంతో అనేక మంది సిస్టర్స్ ఇక్కడకు వచ్చి పేదలు, వృద్ధులకు సేవలందిస్తున్నారు. అన్నమ్మ మఠం ద్వారా వైద్యశాల, సెయింట్ మేరీస్ పేరుతో ఉన్నత పాఠశాలను స్థాపించడంతో పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. శుభవార్త చర్చి ద్వారా మఠంపల్లి నుంచి వెళ్లిన అనేకమంది మత గురువులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ చర్చిలలో సేవలందిస్తున్నారు. నిత్యం ఈ చర్చిలో ఉదయం, సాయంత్రం ప్రార్థనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా క్రిస్మస్ వేడుకలు, ఆత్మల పండుగ, గుడ్ ఫ్రైడే, ఈస్టర్ డే ఘనంగా జరుపుకుంటారు. ప్రతిఏటా చర్చి వార్షికోత్సవంలో భాగంగా ఏప్రిల్ 25న నిర్వహించే శుభవార్త చర్చి జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మత గురువులు, బిషప్‌లతో పాటు దేశ విదేశాల్లోని క్రైస్తవులు కూడా హాజరై ప్రార్థనలు నిర్వహిస్తుంటారు.


మఠంపల్లిలోని శుభవార్త చర్చి


చర్చిలోని ఏసుక్రీస్తు విగ్రహం

గతంలో మంగళవార్త దేవాలయం

శుభవార్త చర్చికి గతంలో మంగళవార్త దేవాలయం అని పేరు ఉండేది. అయితే కన్య మరియమాత గర్భంలో బాలయేసు జన్మించాడని గాబ్రియేల్(దేవదూత) దూత పలికిన శుభసూచికమైన వార్తయే మంగళవార్తగా, శుభవార్తగా చర్చికి నామకరణం చేసినట్లు స్థానిక క్రైస్తవులు చెబుతున్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి మహిళ నిరసన


ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న అచ్చమ్మ

నడిగూడెం: తన కుమారుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో వాటర్ ట్యాంక ఎక్కి నిరసన తెలిపింది. వివరాలు.. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన గుంజ యల్లయ్య, మురళి అన్నదమ్ములు. మురళికి, అతడి భార్యకు కొద్దిరోజులుగా తగాదాలు జరుగుతున్నాయి. గత నెల మురళి, అతడి భార్య గొడవ పడుతుంగా.. యల్లయ్య సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా కొందరు దుండగులు అతడిపై దాడి చేశారు. దీంతో యల్లయ్య తీవ్ర గాయాలపాలై కోమాలోకి వెళ్లి ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారని, కానీ తమకు ఇప్పటి వరకు న్యాయం చేయడం లేదని యల్లయ్య తల్లి అచ్చమ్మ గురువారం నడిగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి నిరసనకు దిగింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ ఏడుకొండలు ఘటనా స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చి అచ్చమ్మను కిందకు దించారు.

బస్సు కింద పడి వ్యక్తికి గాయాలు

భువనగిరి క్రైం: బస్సు కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో గురువారం జరిగింది. వివరాలు.. భువనగిరి మండలంలోని కూనురు గ్రామానికి చెందిన రామగిరి రాంబాబు టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. టైలరింగ్ మెటీరియల్ కోసం గురువారం ఆయన టీవీఎస్ మోపెడ్‌పై భువనగిరికి వచ్చాడు. తన బంధువైన ఆర్. కిషోర్ హైదరాబాద్ నుంచి బస్సులో వచ్చి కొత్త బస్టాండ్ దిగడంతో ఆయనను ఎక్కించుకునేందుకు టీవీఎస్ మోపెడ్‌పై బస్టాండ్‌కు వెళ్లాడు. కిషోర్‌ను టీవీఎస్ మోపెడ్‌పై ఎక్కించుకొని బయల్దేరుతుండగా.. హైదరాబాద్‌కు వెళ్లే బస్సు ప్లాట్‌ఫాం నుంచి వెనకకు వస్తుండడంతో వీరు కొద్దిగా వెనకకు జరిగారు. అదే సమయంలో తొర్రూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సు ప్లాట్‌ఫాం నుంచి వెనుకకు తీసుకోవడంతో వీరి మోపెడ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు తీ వ్రంగా గాయపడ్డాడు. చికి త్స నిమిత్తం అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు


బోల్తాపడిన ఆటో

నాంపల్లి: ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన నాంపల్లి మండలంలోని గట్లమల్లేపల్లి వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలంలోని పాల్వాయి గ్రామానికి చెందిన 10 మంది కలిసి గ్యాస్ ఈకేవైసీ చేసుకునేందుకు గురువారం ఆటోలో నాంపల్లిలోని గ్యాస్ ఏజెన్సీ వద్ద వచ్చారు. తిరిగి వారి స్వగ్రామానికి వెళ్తుండగా నాంపల్లి మండలంలోని గట్లమల్లేపల్లి గ్రామ శివారులో మూలమలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు కాగా వారిలో గిరి వెంకటయ్యకు కాలు విరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ శ్రీశైలం అతివేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తులు అరెస్ట్

- నిందితుల నుంచి 100గ్రాముల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్

సూర్యాపేట క్రైం: గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను గురువారం సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట పట్టణంలోని కొత్తగూడెం బజార్‌కు చెందిన షేక్ నసీర్ అలియాస్ డాన్ నసీర్ అలియాస్ నసీర్ బాబా, బవర్ రోహిత్, దోరేపల్లి శివకుమార్ గంజాయి సేవిస్తుండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయి విక్రయిస్తున్న మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ రవీందర్, సిబ్బంది సైదులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సృజన టెక్ ఫెస్ట్


ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన సృజన టెక్ ఫెస్ట్–2023 ఆకట్టుకుంది. ఈ టెక్ ఫెస్ట్‌లో సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విభాగాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉమ్మడి జిల్లా నుంచి సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో సూర్యాపేట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు గ్రీన్ బిల్డింగ్స్, నాగార్జునసాగర్ పాలిటెక్నిక్ విద్యార్థులు లో కాస్ట్ హౌజింగ్ బిల్డింగ్ మెటీరియల్స్, తిరుమలగిరి పాలిటెక్నిక్ విద్యార్థులు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాల నుంచి స్మార్ట్ పాలిటెక్నిక్ క్యాంపస్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కాలేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం, సూర్యాపేట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఎన్‌హాన్సింగ్ కెరీర్ గైడెన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ టెక్ ఫెస్ట్‌కు హాజరై ప్రదర్శనలను తిలకించారు. సివిల్ ఇంజనీరింగ్‌లో సూర్యాపేట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన గ్రీన్ బిల్డింగ్స్ ప్రాజెక్టు, కంప్యూటర్ సైన్స్ విభాగంలో నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రూపొందించిన కాలేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. అనంతరం విజేతలకు సర్టిఫికెట్స్, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. జానకిదేవి, కోఆర్డినేటర్లు డాక్టర్ అశోక్, టి. సుధాకర్ పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి అంగవైకల్యం అడ్డురాదు


విద్యార్థినులతో దివ్యాంగురాలు, మౌత్ పెయింటర్ శ్రీలేఖ

కోదాడఅర్బన్: సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి అంగవైకల్యం అడ్డురాదని.. కృషి, పట్టుదల, ధైర్యం, సాహసం ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని దివ్యాంగురాలు, మౌత్ పెయింటర్ కళాకారిణి శ్రీలేఖ అన్నారు. గురువారం కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ డాక్టర్ నీలా సత్యనారాయణ మాట్లాడుతూ.. కిట్స్ కళాశాల విద్యార్థినులు శ్రీలేఖను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ నీలా అరుణాదేవి, అకడమిక్ అడ్వయిజర్, డైరెక్టర్లు పోతుగంటి నాగేశ్వరరావు, డాక్టర్ నాగార్జునరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గాంధీ, ప్రముఖ విద్యావేత్త గోనారెడ్డి, రామలింగేశ్వరరావు, పోతుగంటి పద్మ, రవీంద్రరెడ్డి, స్వర్ణభారతి, విజయీభవ ట్రస్ట్ నిర్వాహకులు ఇరుకుళ్ల చెన్నకేశవరావు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కరెంట్ స్తంభాలను ఢీకొట్టిన కారు

- ఘటనా స్థలంలోనే యువకుడు దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


ప్రశాంత్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: కారు అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం శివారులో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జలాల్‌పురం గ్రామానికి చెందిన కేసారం ప్రశాంత్ (19) చిన్నతనంలోనే అతడి తండ్రి కేసారం పాపయ్య మృతిచెందగా.. తల్లి ఇల్లు వదిలి వెళ్లిపోయింది. దీంతో ప్రశాంత్‌ను అతడి తాత, నాయనమ్మ పెంచి పెద్ద చేశారు. ప్రస్తుతం ప్రశాంత్ హైదర్‌పూర్‌లోని ఓ ఫాంహౌజ్‌లో పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా సెల్ఫ్ డ్రైవింగ్ కారును అద్దెకు తెచ్చుకొన్న ప్రశాంత్ బుధవారం సాయంత్రం జలాల్‌పురం గ్రామానికే చెందిన తన స్నేహితులు నర్ర విజయ్, నర్ర శివ, శాపాక నవదీప్, నర్ర శ్రీరాములుతో కలిసి పోచంపల్లికి వచ్చాడు. అనంతరం అర్ధరాత్రి 11.50 గంటల సమయంలో పోచంపల్లి నుంచి జలాల్‌పురం వెళ్తుండగా.. గ్రామ శివారులోని సబ్ స్టేషన్ సమీపంలోకి రాగానే మూలమలుపు వద్ద అతివేగంగా ఉన్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కరెంట్ స్తంభాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్ అక్కడక్కడే మృతిచెందగా, నర్ర విజయ్, నర్ర శివకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు శాపాక నవదీప్, శ్రీరాములు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

తప్పిన పెనుప్రమాదం..

కాగా అతివేగంగా ఉన్న కారు రోడ్డు పక్కనే ఉన్న భారీ కరెంట్ స్తంభాలను బలంగా ఢీకొట్టడంతో కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. కరెంట్ తీగలు కారుపై పడ్డాయి. దీంతో కరెంట్ ప్రసరణ ఉండటంతో క్షతగాత్రులను బయటికి తీయడానికి అక్కడున్నవారు కొద్దిసేపు సాహసించలేదు. అయితే కొద్దిసేపటి తర్వాత కరెంట్ వైరు కారు నుంచి పక్కకు జారిపడటంతో అందరూ విద్యుదాఘాతం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. లేదంటే కారులోఉన్న ఐదుగురు విద్యుదాఘాతానికి గురయ్యేవారు. వెంటనే కరెంట్ సరఫరాను నిలిపివేశారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

చిట్టీల పేరుతో సామాన్యులకు టోకరా

- ఐదేళ్ల క్రితం రూ.20 కోట్లకు ముంచిన సేవా చిట్స్
- తాజాగా రూ.6 కోట్లకు ఐపీ పెట్టిన మరో వ్యాపారి

కోదాడ: కోదాడ కేంద్రంగా జరుగుతున్న చిట్టీ వ్యాపారుల మోసాలకు తెరపడడం లేదు. అవసరానికి ఉపయోగపడతాయని రూపాయి.. రూపాయి జమ చేస్తున్న సామాన్యులను చిట్టీల వ్యాపారులు నిండా ముంచుతున్నారు. 20 నుంచి 30 సంవత్సరాలు ఇదే వ్యాపారం చేస్తున్న ఇద్దరు వ్యాపారులు సామాన్యులకు దాదాపు రూ.25కోట్లు కుచ్చుటోపి పెట్టారు. నాలుగు సంవత్సరాల క్రితం కోదాడకు చెందిన సేవా చిట్స్ యజమాని రూ.20కోట్లు చెల్లించకుండా మొహం చాటేయగా.. తాజాగా మరో వ్యాపారి దాదాపు రూ.6కోట్ల మేర ఐపీ పెడుతున్నట్లు సమాచారం. ఒక చిట్టీ నిర్వహణకు మాత్రమే అనుమతి తీసుకొని పదుల సంఖ్యలో చిట్టీలను నడుపుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

తెలివిగా తప్పించుకుంటున్నారు..

రిజిస్టర్ చిట్టీ ఒకటి మాత్రమే అనుమతి తీసుకొని కోట్ల రూపాయలు చిట్టీలు నడుపుతున్న వీరు బోర్డు తిప్పేస్తే బాధితులకు చిల్లిగవ్వ కూడా రావడం లేదు. అజ్ఞాతంలోకి వెళ్లడానికి ముందే వీరు తమ ఆస్తులను ఇతరులకు గుట్టచప్పుడు కాకుండా అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించి ఐపీ దాఖలు చేస్తుండడంతో పోలీసులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. కోర్టులకు చేరుతున్న వ్యవహారం సంవత్సరాల తరబడి తేలకపోవడంతో బాధితులు పూర్తిగా నష్టపోతున్నారు. కోదాడలో ఇలా ఒక చిట్టీకి మాత్రమే అనుమతి తీసుకొని పదుల సంఖ్యలో చిట్టీలను నడుపుతున్న సంస్థలు పదుల సంఖ్యలో ఉన్నాయని వాటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వందల్లో బాధితులు..

మూడు రోజుల క్రితం కోదాడకు చెందిన వ్యాపారి ఒకరు 300 మంది చిట్టీదారులకు దాదాపు రూ.6 కోట్ల మేర డబ్బులు చెల్లించాల్సి ఉండగా అజ్ఞాతంలోకి వెళ్లడంతో లబోదిబోమంటున్నారు. ఇతడి వద్ద పలువురు చిరు వ్యాపారులు చిట్టీలు వేసినట్లు సమాచారం. రాజస్తాన్‌కు చెందిన మార్వాడీ వ్యాపారులు పలువురు ఇతని వద్ద లక్షల్లో చిట్టీలు వేసినట్లు తెలుస్తుంది. వీరితో పాటు పలువురు మెడికల్ దుకాణాల యజమానులు, చెప్పుల దుకాణంలో పనిచేసేవారు, అనంతగిరి రోడ్డులోని ఎలక్ట్రికల్ దుకాణదారులు, వైద్యులు ఇతని బాధితులుగా మారారు. 30 సంవత్సరాలుగా నమ్మకంగా చిట్టీలను నడుపుతుండడంతో అతని వద్ద చేరామని ఇలా చేస్తాడని తాము ఊహించలేదని పలువురు వాపోతున్నారు.

కోళ్ల వ్యర్థాల పరిశ్రమ మూసివేయాలని ఆదేశాలు

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో గల కోళ్ల వ్యర్థాల పరిశ్రమను మూసివేయాలని కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సురేష్ నిర్ధారించారు. వివరాలు.. తంగడపల్లి గ్రామంలోని ఐఎస్ ఆగ్రోవిట్ ప్రొడక్ట్స్ పేరిట కొన్నేళ్ల క్రితం పరిశ్రమ ఏర్పాటయ్యింది. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి వాహనాల ద్వారా సేకరించి తీసుకొచ్చే కోళ్ల వ్యర్థాలతో పలు రకాల ఉత్పత్తులను తయారు చేస్తుంటారు. అయితే పరిశ్రమ ద్వారా వెలువడే దుర్వాసన, వాయి కాలుష్యంతో పరిసరాల్లోని చౌటుప్పల్, తంగడపల్లి, ధర్మోజిగూడెం, లక్కారం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో తంగడపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ముటుకుల్లోజు రాఘవచారి ఇటీవల రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమ ద్వారా కాలుష్యం వెదజల్లుతున్నట్లు గుర్తించారు. కోళ్ల వ్యర్థాలను నిల్వచేసేందుకు అవసరమైన చిల్లింగ్ లేకపోవడం, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని నిర్ధారించారు. ఆ నివేదిక ప్రకారం పరిశ్రమను మూసివేయాలని మెంబర్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా పరిశ్రమకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.27,72,240


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామ పంచాయతీ పరిధిలో కొలువైన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన హుండీలను గురువారం ఆలయ అధికారులు లెక్కించారు. గత 28 రోజులుగా దేవస్థానానికి హుండీ 27,72,240 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా అన్నదానం హుండీ ఆదాయం రూ.55,002 వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో నల్లగొండ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ డివిజన్ పరిశీలకురాలు వెంకటలక్ష్మి, పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరశర్మ, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, శంకర్, రవీందర్‌రెడ్డి, ఆలయంలో పనిచేసే సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటి రూపాయలు కాజేశారు..!

- ఆరోపిస్తున్న ఖాతాదారులు
- ఫైలాన్‌కాలనీ సబ్ పోస్టాఫీస్‌లో తవ్విన కొద్ది బయటకు వస్తున్న నిజాలు


ఫైలాన్‌కాలనీ సబ్ పోస్టాఫీస్ ముందు బారులుదీరిన ఖాతాదారులు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఫైలాన్‌కాలనీ సబ్ పోస్టాఫీస్‌లో సుమారు కోటి రూపాయల ఖాతాదారుల నగదును సబ్ పోస్ట్ మాస్టర్ తమ ఖాతాల్లోకి మళ్లించి విత్‌డ్రా చేసుకోని వెళ్లినట్లు ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. గత రెండు రోజులుగా జరుగుతున్న విచారణలో ఇప్పటివరకు రూ.40లక్షల నగదు లేనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ నెల 16న దేవరకొండ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్ ఆకస్మికంగా ఫైలాన్‌కాలనీ సబ్ పోస్టాఫీస్‌ను సందర్శించగా.. రూ.6.20 లక్షలు తక్కువగా ఉన్నాయని తేలడంతో విధులు నిర్వహిస్తున్న తిరుమల రామకృష్ణను వెంటనే సస్పెండ్ చేశారు. రంగయ్యను ఇన్‌చార్జిగా నియమించి ఖాతాదారుల పాసుపుస్తకాలను, ఖాతాలో జమ అయిన నగదును పరిశీలిస్తే తేడాలు ఉండటం గమనించారు. నగదు పక్కదారి పట్టినట్లు తేలడంతో లావాదేవీలను నిలిపివేసి బుధవారం నుంచి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. ఇప్పటి వరకు రూ.40లక్షలు నగదు మాయమైనట్లు సమాచారం. ఇంకా చాలా ఖాతాలను పరిశీలించాల్సి ఉంది. ఖాతాదారులు తపాలకార్యాలయం వద్ద బారులు తీరారు. తమ పాసుపుస్తకాలు తెచ్చి ఇన్‌చార్జి పోస్టుమాస్టర్‌కు చూపించుకుని నగదు లేదని చెప్పడంతో లబోదిబోమంటున్నారు. సుమారుగా ఈ పోస్టాఫీస్‌లో 5వేల ఖాతాలున్నట్లు సమాచారం. స్థానికంగా సమాచారం తెలిసిన వారు మాత్రమే వచ్చి తమ ఖాతాలోని నగదును చెక్ చేసుకుంటున్నారు. ప్రతి ఖాతా నుంచి నగదు తస్కరించినట్లు ఆరోణపణలు వినిపిస్తున్నాయి. పెన్షన్‌దారులు అధికంగా ఉండటంతో పాటు చిరు వ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులు ఎక్కువగా ఖాతాలు తెరిచారు.

ఖాతాదారులు అధైర్యపడొద్దు
– మదన్‌మోహన్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్

'ఖాతాదారులు అధైర్యపడొద్దు, మీ నగదు ఎక్కడకు పోదు' అని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్ అన్నారు. గురువారం ఆయన పోస్టాఫీస్‌ను సందర్శించి మాట్లాడారు. విచారణ పూర్తై ఎంత మేరకు నగదు పక్కదారి పట్టిందో తేలగానే నగదును విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతిస్తామని వెల్లడించారు. అత్యవసరంగా డబ్బు అవసరమున్న వారు దరఖాస్తు పెట్టుకుంటే ఉన్నతాధికారులకు తెలియజేసి నగదును అందజేసేందుకు ప్రయత్నిస్తాం.